ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# 'నలజారమ్మ అగ్నిప్రవేశం' కావ్యం – ఇతివృత్తం, వర్ణనా వైశిష్ట్యం

డా.తంగి ఓగేశ్వర రావు

తెలుగు అధ్యాపకులు,వి వి గిరి ప్రభుత్వ కళాశాల, దుంపగడప,పశ్చిమ గోదావరి జిల్లా

మొబైల్ నెం : 9959753832,మెయిల్ : t.ogeswararao@gmail.com

Article Received: 15/01/2025 Article Accepted: 12/02/2025 Published Online: 15/02/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2110

**విషయసంగ్రహం:**

ప్రాచీనకాలంలో దేశ రక్షణ కోసం, రాజ్య కీర్తి ప్రతిష్ఠలను కాపాడటానికి ప్రయత్నించి, ఆ ప్రయత్నంలో ప్రాణత్యాగం చేసిన వీరుల గౌరవార్థం వారి ప్రతిమలను దేవాలయాలలో నెలకొల్పి పూజించేవారు. వీటిని వీరగల్లు అని పిలిచారు. మధ్యయుగంలో గ్రామ, కుల గౌరవం కాపాడటానికి ప్రాణత్యాగం చేసిన స్త్రీలను పేరంటాలుగా పిలిచి, వారికి దేవాలయాలు నిర్మించి పూజించారు. అదేవిధంగా సతిసహగమనం చేసిన స్త్రీలను కూడా పేరంటాలుగా పూజించే ఆచారం ఆంధ్రదేశంతో పాటు భారతదేశమంతటా కనిపిస్తుంది. అలాంటి ఇతివృత్తమే 'నలజారమ్మ అగ్నిప్రవేశము' కావ్యం లోనిది. ఈ కావ్యాన్ని దువ్వూరి రామిరెడ్డిగారు రచించారు. డా. ముప్పాళ్ళ వేంకట శివ ప్రసాదరావు దువ్వూరి రామిరెడ్డి రచనలపై బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి 'దువ్వూరి రామిరెడ్డి రచనలు - ఒక పరిశీలన' అనే సిద్ధాంత గ్రంథం వెలువర్చారు. దీనిలో అయన ఇతివృత్తాలు, సాంఘిక చారిత్రిక అంశాలపైనే ఎక్కువ దృష్టి నిలిపారు. నేను ఈ పరిశోధన పత్రంలో దువ్వూరి వారి రచనలలోని వర్ణనలపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఈ పరిశోధనా పత్రం రాయడానికి అవసరమైన ప్రాధమిక సమాచారాన్ని మరియు పుస్తకాలను నెల్లూరు నందలి దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సంస్థ నుండి సేకరించాను.

**కీలక పదాలు:**నలజారామ్మ, దువ్వూరి రామిరెడ్డి, వర్ణన, ఇతివృత్తం, పెంచెలరెడ్డి, వెంకటరెడ్డి, చేను

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**పరిచయం:**

విఖ్యాత తెలుగు కవి, రచయిత, నాటక కర్త, అనువాదకుడు, బహుభాషా కోవిదుడు దువ్వూరి రామిరెడ్డి. అసాధారణమైన తెలుగు సాహితీవేత్త. 'కవి కోకిల' మకుటాన్ని ఇంటిపేరులో ఇముడ్చుకున్న దువ్వూరి శైలి తెలుగు సాహిత్యంలో నవోన్మేషణమై, నలుదిశలా వెలుగులు ప్రసరించింది. ఆయన కళాశాలలో చదువుకోలేదు. ప్రాచీన గ్రంథాలను అవలోకనం చేయలేదు. అయినా భారదేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వమే ఎన్నో ప్రఖ్యాత గ్రంథాలను రచించారు. సాహిత్యంలో అన్ని ప్రక్రియలలో ఆరితేరిన వారుగా పేరొందారు. కలకండ వంటి కమ్మని కావ్యాలు, పలకరిస్తే అశుధారాపాతంగా జాలువారే పద్యపూరిత ప్రబంధాలే కాకుండా సంస్కృత, అరబిక్ భాషల నుంచి ఎన్నో పుస్తకాలను ఆంధ్రీకరించిన నవ్యరీతి దువ్వూరి ప్రత్యేకం.

దువ్వూరి రామిరెడ్డిగారు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరులో నవంబర్ 9, 1895న లక్ష్మిదేవమ్మ, సుబ్బారెడ్డి దంపతులకు జన్మించారు. 23 సంవత్సరాల నాటికే ఎన్నో రచనలు చేశారు. స్వయంకృషితోనే అనేక భాషలలో పండితులయ్యారు. చిన్న వయస్సులోనే నవంబర్ 11, 1947న కీర్తి శేషులయ్యారు. 1917లో, అంటే తన 22వ ఏటనే సి.ఆర్. రెడ్డి అధ్యక్షతన జరిగిన ఒక సభలో ఆయనకు స్వర్ణపతకం బహూకరించారు.

1918లో ఇతని కావ్యం 'వనకుమారి' విజయనగరం మహారాజు ఆస్థానంలోని కావ్యస్పర్ధలో ప్రథమ స్థానం పొందింది. 1929లో విజయవాడ ఆంధ్ర మహాసభ ద్వారా 'కవికోకిల' బిరుదును పొందారు. కేవలం కవిగానే కాకుండా గొప్ప విమర్శకులుగా కూడా సమానమైన ఖ్యాతి గడించారాయన. దువ్వూరి కలం నుంచి జాలువారిన సాహితీ సౌందర్యం గురించి వర్ణించి చెప్పడం కష్టం. మచ్చుకు ఒక్క రచన చదివితే తప్పించి ఆయన లోతైన అంతరంగం ఆవిష్కరించడం అంత సులభం కాదు.

మృదు మధురమైన మాటలు, గంభీరమైన శైలి, అన్నిటికీ మించి ఆ రచనా చాతుర్యం చదువరులను ముగ్ధులను చేస్తాయి. కళ్ళను అక్షరాల వెంట పరుగులెత్తిస్తాయి. చెప్పవలసిన విషయాన్ని సూటిగా, నాటుకునేటట్టు చెప్పడం వల్ల దువ్వూరి విమర్శలు ఆనాటి యువతలో ఆలోచనాత్మకధోరణిని రేకెత్తించాయి.

తెలుగు సాహిత్యంలో 'కర్షక కవి' గా, 'సింహపురి సిరి' గా పేరుపొందిన ఆయన రైతుల జీవనశైలి నేపథ్యంతో 'కృషీవలుడు' అనే ప్రఖ్యాత ఖండ కావ్యాన్ని రచించారు. ఆయన రాసిన యాత్రా రచన 'హైదరాబాద్ పర్యటన', భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం నేపథ్యంలో రచించిన 'మాతృశతకం' చాలా ప్రసిద్ధిగాంచాయి. ఇంకా ఆయన చేసిన ప్రముఖ రచనలు 'నలజారమ్మ అగ్నిప్రవేశము' అనే కావ్యం, 'రసిక జనానందం', 'కృష్ణరాయబారం', అనే ప్రబంధాలు,

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

'పానశాల', 'గులాబీతోట', 'పండ్లతోట' అనే అనువాదాలు, 'మాధవ విజయం', 'కుంభరాణా', 'కర్షక విలాసం' అనే నాటకాలు. ఆయన తెలుగు సినీవినీలాకాశంలో సంభాషణ రచయితగా, దర్శకుడిగా కూడా పనిచేశారు.

స్వయంకృషితో అనేక భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన దువ్వూరి రామిరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వాతంత్ర్య ఉద్యమం నేపథ్యంలో రచించిన 'మాతృశతకం'లోని ప్రతి పద్యం అగ్నిశిఖను తలపించింది. బ్రిటీష్ వారు ఆ పుస్తక ముద్రణను అడ్డుకునేంతగా ప్రజలను ప్రభావితం చేసింది.

1936లో 'సతీతులసి' చిత్రానికి రచయితగా సినిమారంగ ప్రవేశం చేశారు. 'చిత్రనళీయం' సినిమాకు రచనతోపాటు దర్శకత్వం కూడా చేపట్టి సినీదర్శకుడైన మొదటి తెలుగుకవి అనే ఘనతను సాధించారు. తరువాత 'తిరుపతి వేంకటేశ్వర మాహాత్మ్యం', 'పార్వతీ పరిణయము' చిత్రాలకు కొన్ని పాటలను, పద్యాలను రాశారు. చివరగా 'సీతారామ జననం' సినిమాకు మాటలను సమకూర్చారు.

"మన పూర్వకావ్యాల్లో పల్లీ జీవన చిత్రణ చాలా తక్కువ. ఆధునిక కవిత్వంలోనే పల్లీయుల ఆచార వ్యవహారాలకి, నిర్మల ప్రవృత్తుల చిత్రీకరణకి ప్రముఖ స్థానం లభించింది. పల్లీయుల్లో కర్షకులు ముఖ్యులు. కర్షక వాఙ్మయానికి రెండు కారణాలు చెప్తారు - ఒకటి మహాత్మా గాంధీ గ్రామాభ్యుదయానికి ఇచ్చిన పిలుపు Back to villages. పల్లెటూళ్ళు దేశానికి వెన్నెముక అని ప్రబోధించిన గాంధీ ప్రభావం కొంత ఉండవచ్చు, ఇంగ్లీషు కవిత్వంలో 'Pastoral Poetry' వుంది. Pasture అంటే పచ్చికబీలం. దానినుండి వచ్చిందే పోస్టరల్. కర్షకులను గురించి చెప్పింది కర్షకకవిత్వం అవుతుంది. ఇంగ్లీషు కవులు గొర్రెల కాపరుల గురించి చెప్పారు. వర్డ్స్ వర్త్ 'మైకేల్' మొదలైన కావ్యాలలో కాపువారి జీవితాన్ని వస్తువుగా తీసుకొని రచించటం గమనించవచ్చు. ఇంగ్లీషులో పాండిత్యం గల దువ్వూరివారు వీటిని చదివి ఉండవచ్చు"[1] అని దువ్వూరి రచనల్లోని గ్రామీణత్వానికి గల కారణాన్ని ద్వా.నా.శాస్త్రి గారు పేర్కొన్నారు.

ఇదే విషయాన్ని రామిరెడ్డిగారే "నాకు ఒక కుగ్రామం నివాసం. ఇప్పటి వరకు నా జీవితమంతా ఆ గ్రామంలోనే కొనసాగిపోయింది. పరిసరాల ప్రభావం వల్లనో యేమో నా జీవితంలోనూ కవిత్వంలోనూ గ్రామీణత్వం పరిస్ఫుటంగా అంకితమై ఉంటుంది"[2]అని తన కవిత్వం గురించి వివరించారు.

"తనకల్పనలు సత్యముగా పొడకట్టజేసి తన సృజించిన కథాపురుషుల దశా విశేషములతో పాఠకులకు గాఢమైన సహానుభూతి కలిగించి తన యనుభవించిన రసమునకు వారి హృదయముల నెలయించి యన్యమును మరిపించుటయే కవిత్వమునకు లక్షణమేమి, రామిరెడ్డిగారు కవియేగాక కవివతంసులనియు జెప్పనొప్పియున్నారు"[3] అని దుర్భ సుబ్రహ్మణ్యశర్మ గారు దువ్వూరి రామిరెడ్డిగారి కవిత్వం గురించి పేర్కొన్నారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

# సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

దేశ, గ్రామ రక్షణ కోసం, కుటుంబ పరువు మర్యాదలను కావాడే నిమిత్తం ప్రాణ త్యాగం చేసిన స్త్రీలను పెరంటాలు అంటారు. వీరికి ఆయా రాజ్యాలలోనూ, గ్రామాలలోనూ దేవాలయాలు నిర్మించి పూజించడం మన దేశమంతటా ఉంది. అదేవిధంగా మన దేశంలో ఒకప్పుడు 'సతిసహగమనం' అనే ఆచారం ఉండేది. భర్త మరణించిన తర్వాత అతని శవంతోపాటూ భార్యను కూడా ఆ చితిలో దహనం చేయడాన్ని సతిసహగమనం అంటారు. రాజారామ్మోహన్ రాయ్ వంటి సంఘుసంస్కర్తల కృషి వలన ఈ దురాచారం నశించింది. పూర్వం ఈ సతిని పాటించి మరణించిన స్త్రీలను కూడా పెరంటాలుగా భావించి ఆ కుటుంబాల వారు, కులాలవారు పూజించడం గమనించవచ్చు.

తెలుగు సాహిత్యంలో మొదటి సారిగా కట్టమంచి రామలింగారెడ్డిగారు బుక్కరాయ సముద్రం చెరువు కట్టను కాపాడటానికి ప్రాణత్యాగం చేసిన ఒక స్త్రీ యొక్క చరిత్రను 'ముసలమ్మ మరణం' గా అక్షరబద్ధం చేశారు. బలాత్కరించబోయిన రాజు నుండి కాపాడుకోవడం కోసం అగ్ని గుండంలో దూకిన మరో స్త్రీ యొక్క చరిత్రను 'కన్యక' అనే పేరుతో గురజాడ అప్పారావు అక్షరీకరించారు. అదేవిధంగా కుటుంబ గౌరవ మర్యాదలను కాపాడటం కోసం సతిసహగమనం చేసిన నలజారమ్మ అనే పెరంటాల ఇతివృత్తాంతాన్ని దువ్వూరి రామిరెడ్డి గారు 'నలజారమ్మ అగ్నిప్రవేశము' పేరుతో పద్య కావ్యం రచించారు. ఇది ఇతని మొదటి కావ్యం.

నారాయణమ్మ అనే పెరంటాల ఇతివృత్తాన్ని 'నారాయణమ్మ' పేరుతో పద్యకావ్యం రాసిన విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు "ఇది గూడూరు పంటరెడ్డి పేరంటాలు నారాయణమ్మ ఆత్మార్పణగాథా కావ్యం. వీరిత్యాగము, విషాదము జమీటిన పురి ఎక్కినవి. ఇంతకుముందు కవికోకిల దువ్వూరు రామిరెడ్డి కులగౌరవం నిలుపను ఆత్మబలిదానం గావించిన ఇంకొక గూడూరు పంటరెడ్డి వీరాంగన పవిత్రచరిత్రను 'నలజారమ్మ అగ్నిప్రవేశము' అని త్యాగమహిమ, కులగౌరవముల వర్ణిస్తూ కన్నుల నీరు నిండే కరుణ రస కావ్యమును వ్రాసి ఉండినారు. నారాయణమ్మ లేతకాపు (కాటంరెడ్డి శాఖ - స్మార్తము). నలజారమ్మ ముదురుకాపు (పెరమారెడ్డి తెగ - వైష్ణవం). కవికోకిల ఈ శాఖవారు. ఇప్పుడు ఈ రెడ్లశాఖలన్నీ వడ్లవంగడాలవలె కలిసిపోతున్నవి"[4] అని పేర్కొన్నారు.

"ఇందలి ఇతి వృత్తము కల్పితముగాదు. ఇప్పటికి దాదాపు రెండు వందల సంవత్సరములకు పూర్వము నెల్లూరు మండలమునందున్న గూడూరు నందు ఈ చరిత్ర జరిగినట్లుచ్చటి వృద్ధజనులచే జెప్పబడుచున్నది. ఇందుకు సాక్షిభూతముగా నలజారమ్మ జ్ఞాపకర్థమై గూడూరునందొక దేవాలయము నిర్మింపబడియున్నది. ఈ కావ్యమందు నలజారమ్మ పాతివ్రత్యము, చిత్తస్థైర్యమున్ను, పెంచెలరెడ్డి న్యాయైకపరతము, వెంకటరెడ్డి యకృత్రిమమున్ను తెలియబడుచున్నవి"[5] అని దువ్వూరి రామిరెడ్డి తన కావ్యం 'నలజారమ్మ అగ్నిప్రవేశము' ఇతివృత్తం గురించి చెప్పియున్నారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

" 'నలజారమ్మ' వ్రాయునప్పటికి రెడ్డిగారికి ఇరువదియేండ్లు. నలజారమ్మ, తనతల్లి (పెరుమారెడ్డివారి) యింటి యాడుబరుచు. వివాహాది శుభ సందర్భముల యందు ఆమె గుడికిబోయి మ్రొక్కుకొనుట తమవారి యాచారము. మరియామె యాగ్నిగుండాన నురికిన కథ యీమాణవున కెవరునుడివిరో, యిది చిన్ననాట నాతని చిత్తమున కెంతయత్తినదో, అదియే యాతని తొలి రచన కితివృత్తమైనది"[6] అని దుర్భ సుబ్రహ్మణ్యశర్మ గారు 'నలజారమ్మ అగ్నిప్రవేశము' ను తొలికావ్యంగా దువ్వూరి వారు రాయడానికి గల కారణాన్ని వివరించారు.

"మంజులనందనాంతర సమంచితకల్పలతాకుడుంగ మం
దంజిగ లేక రత్నరచితాయతవేదిక విశ్రమించి, గం
గం జరియించు చల్లనగు గాడ్పులునోక ముదంబునొందుచున్
సంజమనోజ్ఞదీధితుల సఖ్యమునెంచెడు రుక్మిణమ్మ, బా
ష్పాంజలితోడనీకు కృతి నంకితమిచ్చితి కొమ్ము ప్రేముడిన్"[7]

అని రామిరెడ్డి గారు ఈ కావ్యాన్ని స్వరాస్తురాలైన తన చెల్లిని స్మరించుకుంటా, ఆమెకు అంకితం చేశారు.

నలజారమ్మ అగ్నిప్రవేశము – ఇతివృత్తము :

"శ్రీ సింహపురీ మండల
కాసార మరాళమనగ కాంతిల్లి రమా
వాసంబయి సతతంబును
వాసి న్గూడూరు మిగుల వర్ధిలుచుండున్"(న.అ.ప్ర. పద్యం 7)

అటువంటి గూడూరు గ్రామం దేవాలయాలతో, వేదపండితులతో, వ్యాపార వాణిజ్యాది కార్యక్రమాలతో తులతూగుతుంది. దీనికి కారణం వ్యవసాయాది కార్యక్రమాలు సంవృద్ధిగా జరగడం. రైతులు సుఖశాంతులతో ఉండటం వలన వ్యవసాయానుబంధ వృత్తులవారు సైతం హాయిగా జీవిస్తున్నారు.

ఈ గ్రామం నందు వెంకటరెడ్డి అనే మోతుబరి రైతు ఉన్నాడు. అతను అదే గ్రామ పెద్ద పెరుమారెడ్డి వంశానికి చెడిన పెంచెలరెడ్డి కుమార్తె నలజారమ్మను వివాహం చేసుకున్నాడు. ఆస్తి అంతస్తులకు, ప్రేమాభిమానాలకు లోటు లేని సంసారం వారిది. ఆ దేవుడు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లోటు పెడతాడు. వీరికి కూడా వివాహమై చాలా కాలం గడిచినా సంతానం లేకపోవడమే విచారం ఉంది. నలజారమ్మ సంతానం కోసం నొయ్యని నోములేదు, చెయ్యని దానం లేదు.

"పిట్టలకైన సంతసము పేర్చును పిల్లలగూడియుంట; నా

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

కట్టిడి బ్రహ్మయేలొకో సుఖంబులు సంపదలిచ్చి యొక్కనిం
బట్టిని గల్లజేయడు? ప్రపంచము నందిక నిట్టిజీవితం
బెట్టులబుచ్చనౌను; హృదయేశ్వర, యీశ్వరమాయయెట్టిదో!" (న.అ.ప్ర. పద్యం 51)

అని దుఃఖించగా, చివరికి ఆమె పూర్వ జన్మ సుకృతం వల్ల గర్భం ధరించింది.

ఆ సంవత్సరం వానలు సకాలంలో పడి పంటలు సంవృద్ధిగా పండాయి. కోతలకు సిద్ధంగా ఉండగా ఒకరోజు రాత్రి భోజనం చేసిన తరువాత వెంకటరెడ్డి "సతి, పందులు దున్నలు గోవ యావులున్ సతతము జొన్నచేలబడి సర్వము నాశనము చేసెనంట : యా వితమును నేటిరాత్రిగని వేకువవత్తున్" (న.అ.ప్ర. పద్యం 64) అని చెప్పి పొలానికి బయలుదేరగా, అప్పుడు గర్భవతైన అతని భార్య "ఊచబియ్యముమీద నాకూహ వొడమె, తిరిగివచ్చెడు నప్పుడు తెమ్మ జొన్న కంకు లొకపది" (న.అ.ప్ర. పద్యం 65) అని అడుగగా అతను సరేనని తలవూపి పొలానికి వెళ్ళాడు.

ఆ రోజు రాత్రి నలజారమ్మకు తన భర్త మరణించినట్లు, తాను అగ్నిగుండంలో దూకుతున్నట్లు కలవస్తుంది. దీనితో ఆమె ఉదయం ఎప్పుడు అవుతుందా? తన భర్త ఎప్పుడు ఇంటికి వస్తాడా? అని ఎదురు చూస్తూ ఆ రాత్రి శివరాత్రిలా జాగారం చేస్తుంది. ఇంతలో ఆమెకు పురిటి నొప్పులు వస్తాయి. నలజారమ్మ తన అమ్మకు కబురు పెట్టగా ఆమె మంత్రసానిని వెంటబెట్టుకొని కూతురు వద్దకు వస్తుంది.

ఒక మాదిగవాడు తన పొలంలో జొన్న కంకులు విరిచి ఉండటం గమనించి, విచారించగా అక్కడ పశువులను మేపుతున్న కొందరు మాలపిల్లల ద్వారా ఆ కంకులు విరిచింది వెంకటరెడ్డని తెలుసుకొని, అతని మామ అయిన పెంచెలరెడ్డి ఇంటికి వెళ్ళి

"ఎన్నడెఱుగని మీ యల్లుడేమొకాని
నిన్నప్రొద్దున వచ్చి మా జొన్నమడికి,
పెద్దకంకులు బుట్టెడు విఱిచెనంట!
కంచెయే చేనుమేసిన గలదెదిక్కు?" (న.అ.ప్ర. పద్యం 75)

అని వేడుకోగా, పెంచెలరెడ్డి

"ఇవ్విధి జాలివుట్ట వచియించిన మాదిగవాని జూచి యీ
సవ్వడి యల్లునింబిలిచి చక్కవిచారణచేసి, యింక నీ
కెవ్విధమైన కష్టము రహింపకయుండెడు నట్లొనర్తు, నీ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

వివ్వగ మాని పొమ్మ, మడికేగుమ యన్న వినమ్రశీర్షుడై" (న.అ.ప్ర. పద్యం 81)

వారు వెళ్ళిపోయిన తరవాత దురాశతో పెంచెలరెడ్డి అల్లుడు మాదిగవారి చేలో జొన్న కంకులు దొంగతనం చేశాడని నలగురూ అంటే తనకు కలిగే అవమానమని తలచుకొని విచారిస్తాడు. ఇంతలో ఒక స్త్రీ వచ్చి నలజారమ్మ బాలికను ప్రసవించిందని చెప్పడంతో మానుమరాలను, కూతుర్ని చూడడానికి వెంకటరెడ్డి ఇంటికి వెళ్తాడు. వారిని చూసి సంతోషిస్తాడు. అంతలో వెంకటరెడ్డి చేసిన పని గుర్తుకు వచ్చి

"చౌర్యము నీచకృత్యమని, శాస్త్ర విరుద్ధమటం చెఱింగియున్

దుర్యశమొప్ప సల్పు నతిదుష్టున కెమ్మెయి శిక్షసేయగా

నార్యులకు న్ముదంబగును న్యాయము సెప్పు; మిజారుదారు దు

ష్కార్యనియుక్తచిత్తులను గాటియపెట్టక వీడవచ్చునే?" (న.అ.ప్ర. పద్యం 94)

అని నలజారమ్మతో పలుకగా అప్పుడు ఆమె 'ధర్మానికి తనవారు, ఇతరులనే భేదం లేదు. పూర్వం ధర్మానికి కట్టుబడి శ్రీరాముడు తన భార్యను అడవులకు పంపాడు. ధర్మం తప్పి నిండు సభలో ద్రౌపదిని అవమానించిన కౌరవులు నాశనం అయ్యారు. ఎటువంటి పరిస్థితుల్లో కూడా ధర్మం తప్పరాదు' అని చెప్పి "ఒక మానిసి చౌర్యము సల్ప కొర్తయే దవిలిన శిక్షయంచు ప్రథితంబుగ జాటును" (న.అ.ప్ర. పద్యం 96)అని తండ్రితో చెబుతుంది.

పెంచెలరెడ్డి మాటల ద్వారా రాత్రి మాదిగవాని చేలో జొన్నకంకులను ఎవరో విరిచారని, దాని గురించే తన తండ్రి మాట్లాడుతున్నారని తెలుసుకున్న నలజారమ్మ భయపడుతుంది. ఇంతలో వెంకటరెడ్డి తనకు కూతురు పుట్టిందని సంతోషంతో జొన్నల మూట పట్టుకొని ఇంటికి వస్తాడు. వాటిని చూసి నలజారమ్మ ఇవి ఎక్కడవని అడుగుతుంది. అప్పుడు వెంకటరెడ్డి

"జొన్నపాడు సేయు దున్నల పందుల

తోలితోలి కొంతసోలి, రాత్రి

నిదురవోయి లేచి నిదురమత్తున మాది

గ చినవాని చేని కంచెదాటి" (న.అ.ప్ర. పద్యం 107)

అని చెప్పి, కొన్ని కంకులు కోసిన తరువాత జరిగిన తప్పిదాన్ని గమనించి కోయడం మానివేశానని భార్యతో చెబుతాడు. ఆ మాటలు విన్న పెంచెలరెడ్డి తెలిసి చేస్తే అది తప్పు, పొరపాటున చేసింది తప్పుగా భావించరాదని అల్లుడిని సమర్థిస్తాడు. తండ్రి మాటలకు నలజారమ్మ "న్యాయపురీతి వచించు తండ్రి, నీ వను నుడికారమెంతయునయంటె? యశంటె? వెలుంగునిప్పుకల్ గనకయ త్రొక్కినం పదము గాలకయుండునె?

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ధర్మమార్గమున్ మనమెతొలంగినం పరులు మాన్యత జూతురె? నిందదప్పునే" (న.అ.ప్ర. పద్యం 112) అని చెప్పి తన భర్తకు మరణశిక్ష విధించమంటుంది. అదేవిధంగా

"విను హృదయేశ, నాపలుకు వీరుల వంశమునందు బుట్టి యీ దినమున
నిట్టి దుర్యశముదెచ్చిన యల్లుని శిక్షసేయకే
తనయనుజూచి యేమొ నిజధర్మము పెంచలరెడ్డి దప్పెనం
చను నప కీర్తిరాని విధి యారసి యట్లుచరింప పెంపగున్" (న.అ.ప్ర. పద్యం 114)

అని భర్తతో చెప్పి, తాను కూడా భర్తతో పాటు సహగమనం చేయడానికి సిద్ధపడుతుంది.

ఒక ప్రక్క అల్లుడు మరణించడం, మరో ప్రక్క ఒక్కగాన ఒక్క కూతురు సహగమనానికి సిద్ధమవడంతో పెంచెలరెడ్డి భార్య కూతురు వద్దకు వచ్చి సహగమనం చేయవద్దని వారిస్తుంది. అప్పుడు నలజారమ్మ తల్లితో

"నాకొఱకుగాదె నాపతి
వీకను బ్రాణంబు విడిచి విశ్వమునందుం
బ్రాకట యశమును బొందెను;
నాకును నట్టిదియసూపె న్యాయముతల్లీ" (న.అ.ప్ర. పద్యం 123)

అని చెప్పి, భర్త చితిలో దూకి సహగమనం చేస్తుంది.

"పంచభూతాత్మకంబైన పడతి మేను
ప్రకృతి లీనమై పూతమై పరిఢవిల్లె,
మిగిలియుండెడు సత్కీర్తిపగిది సాధ్వి
యాత్మసర్వంబు తానయై యతిశయిల్లె" (న.అ.ప్ర. పద్యం 128)

అని దువ్వూరి రామిరెడ్డి తన వంశపు ఆడపడు ధర్మబుద్ధిని, త్యాగనిరతిని ఈ 'నలజారమ్మ అగ్నిప్రవేశము' కావ్యంలో కొనియాడారు.

నలజారమ్మ అగ్నిప్రవేశము – వర్ణనావైశిష్ట్యం :

వర్ణనలు కావ్యానికి ఆభరణాల వంటివి. అందాన్నిస్తాయి. వర్ణనలు లేని కావ్యం నిస్సారంగా ఉంటుంది. మన ప్రాచీన కవులు, అలంకారికులు కూడా తమ కావ్యాల్లో వర్ణనల ఆవశ్యకతను వివరించారు. ప్రబంధాల వంటి ప్రక్రియకు వర్ణనలే ఆధారం. ప్రబంధాలలో కథ కన్న వర్ణనలకి ప్రాముఖ్యం ఎక్కువగా వుంటుంది. దండి 'కావ్యాదర్శం'లో

"నగ రార్ణవ శైలర్తు చంద్రార్కో దయవర్ణనమ్

ఉద్యాన సలిలక్రీడా మధుపాన రతోత్సవాః
విప్రలంభో వివాహశ్చ కుమారో దయవర్ణనమ్
మంత్ర, ద్యూత, ప్రయాణాజినాయకా భ్యుదయానిచ
ఏతాని యత్ర వర్ణ్యంతే తన్మహా కావ్యమిష్యతే"[8]

అని పద్దెనిమిది వర్ణనలు గలది మహాకావ్యంగా నిర్వచించాడు. అప్పకవి వేట, ముని ఆశ్రమం, కన్యాంగ సౌందర్యం కూడా చేర్చాడు. దేశ, గ్రామ, వన, స్వయంవర, పుష్పాప్చయాది వర్ణనలు కలిపితే దాదాపు ముప్పయి వర్ణనలుంటాయి. ఈ వర్ణనలు ఉంటే అది ప్రబంధం అవుతుంది. అంటే సాధ్యమైనంత వరకు ఎక్కువ వర్ణనలు ఉండాలి.

ప్రాచీన అలంకారాది శాస్త్రాల్లో పేర్కొన్న వర్ణనలను ఆధునిక కావ్యాలకు పూర్తిగా అనువర్తించలేము. ఆధునిక కవులు మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తమ కావ్యాల్లో వర్ణనలను కూడా మార్చుకున్నట్లు దువ్వూరి రామిరెడ్డి కావ్యాలను పరిశీలిస్తే అవగతమౌతుంది. రామిరెడ్డిగారి వర్ణనా సామర్థ్యానికి నిదర్శనం అతని 'నలజారమ్మ అగ్నిప్రవేశము' కావ్యం.

సూర్యోదయ వర్ణన :

దువ్వూరి వారి వర్ణనలు గ్రామీణ వాతావరణానికి దగ్గరగా ఉంటాయి.

"కాముకేళుల నిశియెల్ల గడపి యొడలు
మఱచి నిదురించు యువతుల మందలింప
చూరుసందులనుండి బంగారుసూదు
లవలె వ్యాపించే నరుణాంశులవము లిండ్ల" (న.అ.ప్ర. పద్యం 70)

అంటూ రాత్రి నిద్రించి ఉన్న యువతను బంగారు సూదులతో గిచ్చి లేపుతున్నాయి అరుణ కిరణాలు అని సూర్యోదయాన్ని రామిరెడ్డిగారు వర్ణించిన తీరు మనోహరం. అదేవిధంగా ఇదే కావ్యంలో రచయిత మరోసారి

"ప్రకృతిచైతన్య భావముపాపినట్టి
సంతమసమును హరియింప సమయవైద్యు
డలరుపారద సిందూర గుళిక వైచె
ననగ నుదయించె రవిబింబ మరుణదీప్తి" (న.అ.ప్ర. పద్యం 71)

అని సూర్యోదయాన్ని వర్ణించారు. రాత్రి చైతన్యం కోల్పోయిన ప్రకృతికి సమయవైద్యుడు(సూర్యుడు) సిందూర గుళిక వేసి చైతన్యం కలిగించాడని చెప్పడం చక్కని ఔచిత్యానికి ఉదాహరణ.

సూర్యాస్తమ వర్ణన :

ఈ కావ్యంలోని సూర్యాస్తమయ వర్ణనలను పరిశీలిస్తే సహజ మనోహరంగా ఉంటాయి.

"కాలశాక్తేయ డంధికాకాళి కధిక

భక్తి కడసంజ తగరును బలిగనీయ

క్రొత్తనెత్తుటి ధారలు గురిసెననగ

జేవురించెను దిక్కులు చెలువు మీఱ" (న.అ.ప్ర. పద్యం 57)

కాలశాక్తేయుడు (సూర్యుడు) తన అరుణ కిరణాలను బలివ్వడం ద్వారా వచ్చిన ఎర్రని రక్తపు ధారాలు ప్రపంచపు నలుదిక్కుల వ్యాపించాయని రచయిత చెప్పిన పోలిక అద్భుతంగా ఉంది.

"సాంధ్యరాగంబు వృక్షాగ్రశాఖలందు

నలమికొనినంత వహ్నికీలలుగ నెంచి

పక్షులెల్లను కూయుచు పఱచుచుండె

కాలిపోయెను గూళ్ళంచు కడురయమున" (న.అ.ప్ర. పద్యం 59)

సంధ్యాకాలంలో సూర్య కిరణాలు ఎర్రగా, అగ్నిశిఖలుగా కనిపించడం సహజం. అదే విధంగా సాయంకాలం పక్షులు గూళ్ళకు చేరడం కూడా సహజం. ఐతే ఇలా వస్తున్న సూర్య కిరణాలను చూసి పక్షులు తమ గూళ్ళు తగలబడుతున్నాయని భ్రమించి వేగంగా గూళ్ళకు చేరుతున్నాయని రచయిత చెప్పిన తీరు అతని వర్ణనా నైపుణ్యానికి నిదర్శనం.

చంద్రోదయ వర్ణన :

"అభ్రకేదారమున చంద్రుడనెడు గోప

బాలకుం డుడుగణమను పసినిమేపు

చుండు నోయగ మత్తఱినొప్పె; నటుల

గాక, చిన్నమన్ గొంగడి గలుగుటెట్లు?" (న.అ.ప్ర. పద్యం 61)

అంటూ రచయిత చంద్రుడిని గోవులు కాసే బాలుడిగానూ, రాత్రిని ఆ బాలుడు గొంగళి గాను వర్ణించారు.

రాత్రి వర్ణన :

రాత్రి వర్ణనలో ప్రధానంగా చీకటి, తారలు మరియు వెన్నెల వర్ణన కనిపిస్తుంది. రామిరెడ్డిగారు ఈ కావ్యంలో

"తార లుల్లసిల్లె; జారుల మనములు

కలువలట్ల కాంతి గడలుకొనియె
చక్రవాకకాంత స్వాంతంబుపోలిక
తమ్మి మోముమోడ్చె నుమ్మలించి" (న.అ.ప్ర. పద్యం 60)

అనే పద్యంలో ఆకాశంలో నక్షత్రాలు ప్రకాశించాయి. తాత్పలితంగా జారుల మనస్సు కలువల మాదిరిగా వికసించిందని, చక్రవాకంగనలకు స్వాంతన చేకూరిందని రచయిత చెప్పిన పోలిక మనోహరంగా ఉంది. అదేవిధంగా

"హంసబాలిక లంబు విహారలీల
నంబరాపగ తరగల నాటలాడ,
కంపితంబయి యంభోజకాండరజము
లలమికొనెనన వెన్నెల లలరె మింట" (న.అ.ప్ర. పద్యం 62)

అంటూ హంసబాలికలు ఆనందంతో ఆకాశంలో ఆటలాడటం వల్ల ఆ ఆకాశం కంపించి వెన్నెల రూపంలో మింటి నిండా కమ్మెసిందని రచయిత వర్ణించారు.

కావ్య నాయక వర్ణన :

నాయకా, నాయికీ వర్ణనలో ప్రధానంగా కావ్య నాయక, నాయికీ భౌతికరూప వర్ణన, అంతరంగ సౌందర్య వర్ణన ఉంటుంది. అంతరంగ వర్ణనలో గుణగణాల వర్ణన ప్రధానమైంది.

"కొలిచిన మూరకెక్కుడగు గొప్పయురంబును, మాంసలంబులై
మెలికలుకొన్న బాహువులు, మిట్టనొసల్, రుదురాకవన్నె చె
న్నొలసెడు మేనినిగ్గుగల యొక్కడు వెంకటరెడ్డినాగ పే
ర్వెలసెను కష్టజీవియయి పెద్దలనాటి ధనంబు లొప్పగన్" (న.అ.ప్ర. పద్యం 17)

అని రచయిత 'నలజారమ్మ అగ్నిప్రవేశము' కావ్యంలోని నాయకుడైన వెంకటరెడ్డి భౌతికరూపాన్ని రామిరెడ్డిగారు వర్ణించారు. అదేవిధంగా

"చెరువునీటనుమున్గ జేవురించెనెగాని
పెన్నెరి విప్పిన వెన్నుదాటు;
స్ఫోటకచిహ్నాలు వాటిల్లినేగాని
మొలకనవ్వులుగుల్కు ముద్దుమోము;
కావడిమోతల కాయగాచెనెగాని

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

భుజపాళి యుబ్బి సొంపులుఘటించు;
చదువురాకుండుట కొదుకుమాటలెకాని
చతురత సుంతైన సందువోదు;

మడవకట్టుగాండ్ర మడవవ్యాజ్యములలో
తనదె పెద్దగొంతు దనరుచుండు;
సేద్యమందు వళవు సెప్పజాలిన మేటి;
పట్టువిడుపుదెలియు దిట్ట యతడు. (న.అ.ప్ర. పద్యం 19)

అంటూ కావ్య నాయకుని గుణగణాలను వర్ణించారు.

కావ్య నాయికీ వర్ణన :

'నలజారమ్మ అగ్నిప్రవేశము' కావ్యంలో నాయికీ నలజారమ్మ. ఇక్కడ కూడా రచయిత

"నలజారమ్మ యనంగను
సలలితమౌపేరుగల్గి సారసముఖి, కా
పుల పూబోణుల దానొక
తలమానికమటుల దనరె తలమా పొగడన్!" (న.అ.ప్ర. పద్యం 21)

అని ఆమె భౌతిక సౌందర్యాన్ని, అదేవిధంగా

"పరపురుషాస్యముం గనిన పద్మవిలోచన మోమువాంచు; తోం దరపనిలేకయున్న నిలు దా విడనాడదు; వోదు మాటికిం
బరగృహ పణ్యవీధులకు; బంధులజూచిన దల్లిదండ్రులం
గరమనురక్తి గాంచినటుగా మరియాదలు సల్పు బ్రీతిగన్" (న.అ.ప్ర. పద్యం 30)

అంటూ ఆమె అంతరంగ సౌందర్యాన్ని చక్కగా వర్ణించారు.

గ్రామీణుల దైనందిన కార్యక్రమాల వర్ణన :

"దువ్వూరి రామిరెడ్డి చిన్నప్పటినుంచీ వ్యవసాయము చెయ్యకపోయినా తత్సంప్రదాయములో పుట్టినాడు కాబట్టిన్నీ, చిన్నప్పటి నుంచీ కవితాశక్తి కలవాడౌట చేతా, నూతన భావాలు గాఢముగా హృదయములో నాటి తదనుగుణముగా గ్రామీణుల జీవనాన్ని చిత్రించవలెనని కోరిక పొడమినది. కాబట్టి వాళ్ళ వేషభాషలూ, వాళ్ళ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

నాగరకతా గమనించినాడు. ఆయన వ్రాసిన కావ్యాలలో యిటువంటి పదసామగ్రి అనంతంగా కనబడుతుంది. ఈయన కూడా వాక్చిత్ర కల్పనలో చాలా ప్రజ్ఞ చూపినాడు"[9] అని కురుగంటి సీతారామయ్య గారు పేర్కొన్నారు.

పల్లె వర్ణనలో ప్రధానంగా కర్షకుల వృత్తి పరమైన వర్ణన, స్త్రీల దైనందిన కార్యక్రమాల వర్ణన, పిల్లలు, పశువుల కాపరుల వర్ణన ఉంటుంది. దువ్వూరి వారు కూడా ఈ కావ్యంలో

"కుక్కుట జాలంబు కొక్కొరోయని కూయ
నీల్గుచు మూల్గుచు నిదురలేచి,
యతివల కౌగిళ్ళ నల్లన సడలించి
తల్పంబులన్ డిగి, తడవికొనుచు,
పడకటిండ్లను వీడి తడుపుబాతయు చేతి
కఱ్ఱయుగైకొని కడురయమున
పైరుపచ్చలుచూడ పసులను గాపాడ
మడవలుగట్టంగ మడులుదున్న
నెండవాన లనాక యుద్ధండలీల
ప్రొద్దువొడిచిన దాదిగా ప్రొద్దుగ్రుంకు
వఱకు పొలముల కష్టించి వచ్చుచుందు
రప్పురంబున యువకులౌ హాలికవరులు" (న.అ.ప్ర. పద్యం 11)

అంటూ కర్షకుల దైనందిన జీవితాన్ని వివరించారు. అదేవిధంగా

"కొక్కొరోయని కూసె కుక్కుట నికరంబు
రెక్కలు దట్టించి నిక్కినిక్కి,
చెరువునీటికిబోవు చేడెల యందెల
ఘల్లుల్లురావము గడలుకొనియె,
పైరుచేలకు నేగు సైరిక ప్రకరంబు
లొండొరు బిల్చు పెన్నులివు లొప్పె,
గొర్రెమందలలోన గొల్లల పిల్లన
గ్రోవిసంగీతంబు కొమరుమీరె,

లేగదూడలు పల్పులు లాగికొనుచు
నఱ్ఱులెత్తుచు తోకలు జిఱ్ఱకొట్టి
యంభరావంబుసల్పుచు నాలమంద
పాల కఱచుచునుండె నిబ్బరముగాగ" (న.అ.ప్ర. పద్యం 69)

అని గ్రామీణ స్త్రీలను, పశువుల కాపరుల జీవితాన్ని మనోహరంగా వర్ణించారు. గ్రామీణులు తమ తీరిక సమయాన్ని ఏవిదంగా గడుపుతారో రచయిత ఈ క్రింది పద్యంలో అద్భుతంగా వర్ణించారు.

"పండి యఱ్ఱులువంచు పైరుజొంపములకు
    జాళువాపూతలు గీలుకొల్పి,
కన్నెపయ్యెర కల్ల కదలుచు దోగాడు
    జలదబాలలకెఱ్ఱ కలప మలది,
కుజకోటరంబుల కూర్కెడు పెనుగుడ్ల
    గూబల మాంద్యంబు కొల్లగొట్టి,
యెండరాపిళ్ళకు నెరియు క్రొన్ననలకు
    పూర్వరాగంబును బొదలజేసి,
ఆలమందల కదలించి, హాళికులకు
పనులు చాలింప కనుసన్నబరగదెలిపి
భర్తలనుగూడ నుత్కంఠ భామినులకు
గొలిపి, రజనీముఖంబున కొఱలె నినుడు" (న.అ.ప్ర. పద్యం 58)

పాడిపంటలు, జలాశయాల వర్ణన :

'నలజారమ్మ అగ్నిప్రవేశము' నందలి ఇతివృత్తం ప్రధానంగా గ్రామీణ ఇతివృత్తం. గ్రామీణుల జీవనం పాడిపంటలపైనా, చెరువులు మొదలైన నీటి వనరులపైన ఆధారపడి ఉంటుంది. ఈ కావ్యంలో రామిరెడ్డి గారు

"పైరులుపంటలుంగలిగి పంటవలంతికి పచ్చణాల బం
గారపు కొప్పు బిళ్ళలనగా చెలువొప్పును నప్పురంపు ము
క్కారులు పండుచేలు, మును కాపులొసంగిన యప్పుదీర్ప న

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ద్ధారుణి ధాన్యరాసులను దాచిన గాదులనంగ మీఱుచున్" (న.అ.ప్ర. పద్యం 12)

అంటూ పాడిపంటలను వర్ణించిన తీరు ప్రశంసనీయం. అదేవిధంగా

"ప్రోలికి దక్షిణంపుదిశ పుష్కరపుష్కలమై, ప్రకంపనాం
దోళిత వీచికానికర తుందిలమై, కలహంసచక్రమీ
నాలయమై, విశుద్ధసలిలాశయమై తనరుం దటాక ము
త్తాల తటావృతంబునయి తగ్గక నీరు నిదాఘకాలమేన్" (న.అ.ప్ర. పద్యం 13)

అని ఆ గ్రామంలోని చెరువును వర్ణించారు.

సతి సహగమన వర్ణన :

"సహగమనము మధ్య వచ్చిన ఉత్తరహిందూస్థానాచారము మహమ్మదీయుల అత్యాచారాలు ఏ మూలనుండిన అచట యాచారానికి అతివ్యాప్తి కలిగెను. ముఖ్యముగా ఇది కాశ్మీర, రాజపుత్రస్థాన, పంజాబులలో ప్రబలమయ్యెను. తర్వాత బెంగాలులో ప్రబలమయ్యెను. దక్షిణ దేశములో కాకతీయుల కాలములో, రెడ్డిరాజుల కాలములో ప్రారంభమై అరుదుగా నందందు జరుగుటకు మొదలయ్యెనని తలంతును"[10] అని సురవరం ప్రతాపరెడ్డిగారు పేర్కొన్నారు.

ఈ కావ్యంలో పెంచెలరెడ్డి తన అల్లుడు చేసిన పనికి ఏమి చేయాలో ఆలోచిస్తున్నప్పుడు అతని కూతురు నలజారమ్మ న్యాయం తప్పవద్దని చెబుతూ "తురష్కభూపతుల మాట లతిక్రమణంబు సేయగా జనదు" (న.అ.ప్ర. పద్యం 95) అని అంటుంది. అంటే ఈ కావ్య ఇతివృత్తం జరిగిన కాలంలో గూడూరు తురుష్కుల పాలనలో ఉన్నట్లు తెలుస్తుంది. పై ప్రతాపరెడ్డి గారి మాటలను పరిశీలిస్తే ఆంధ్రదేశంలో కూడా ఈ సతి ఆచారం ప్రబలడానికి ముస్లీముల పాలనే కారణమని తెలుస్తుంది. వారి నుండి ఆడబిడ్డలను కాపాడుకోవడానికి ఈ ఆచారాన్ని పాటించి ఉంటారు. ఇది నిర్భందం కాదని తెలుస్తుంది. "కూతురా, మమ్మిట్లు కుందించి నీపేల గుండాన దూకంగ?" (న.అ.ప్ర. పద్యం 122) అని నలజారమ్మ తల్లిగారిచే రచయిత చెప్పించిన మాటలు దీనిని దృఢపరుస్తున్నాయి.

ఈ కావ్యంలో దువ్వూరి రామిరెడ్డిగారు సతిసహగమనానికి ముందు సహగమనానికి సిద్ధమైన స్త్రీని ఏవిధంగా అలంకరిస్తారో ఈ క్రింది పద్యంలో వర్ణించారు.

"జాళువ బంగారు డాలుడీలగజాలు
హారిద్రచేలంబు నంతగట్టి;
పసపునిగ్గులుదేరు ఫాలభాగంబున

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

సిందూర తిలకంబు పొందుపఱిచి;
కన్నుగల్వలుకొంత వన్నెమీఱగ క్రొత్త
కాటుకరేఖలు నీటుపఱిచి,
గుబగుబ సెత్తావి గుల్కెడు జవ్వాది
కలపంబు బాహుల గలయనలది;

జాజిపూవులు చేమంతి సరుల కీలు
గంటునకు జుట్టి వాల్గంటి కరుణమెఱయ
పేర్చుడిప్పుడు గుండము భీతిలేక
యనగ, తండ్రియు కడుభక్తినట్లుచేసె" (న.అ.ప్ర. పద్యం 120)

ఈ వర్ణనను పరిశీలిస్తే జాతరల సమయంలో అమ్మవార్లను అలంకరించిన విధానం గుర్తుకు వస్తుంది. ఇది భవిష్యత్తులో ఆమె పెరంటాలుగా, గ్రామదేవతగా మారుతుందనడానికి చిహ్నమేమో.

"సాంధ్యరాగశ్చటా సంఛాదితాస్తాద్రి
కటకసంచర దభ్రఖండ మనగ,
జలజరాగ పరాగ కలితోర్మి మాలికా
డోలికా చంచ న్మరాళమనగ,
పల్లవితాశోక పాదపాశ్రయ నవ
ప్రసవభారానత వల్లియనగ,
గైరికసింధూర కలితపూర్వాచల
పీఠస్థ పూర్ణేందు బింబమనగ,

సతి రహించెను గుండాన చటులవహ్ని
శిఖలు నల్లడ వ్యాపించి చిటపటోగ్ర
శబ్దభీమంబులై ధూమచయము గ్రక్క,
ప్రేక్షకావళిగుండెలు పెటిలిపోవ" (న.అ.ప్ర. పద్యం 127)

అంటూ రచయిత వర్ణించిన సహగమన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తుంది.

దువ్వూరి రామిరెడ్డిగారి తాత్వికతను, అభ్యుదయ దృక్పథాన్ని తెలియజేసే అనేక పద్యాలు కూడా ఈ కావ్యంలో ఉన్నాయి.

"సుతుడైన మాతయైనను
సతియైనను నల్లుడైన సత్యంబునకున్
వ్యతిరేకత వర్తించిన
మతిమంతులు వారి పొత్తుమానుదురు ధరన్" (న.అ.ప్ర. పద్యం 86)

అంటూ రచయిత చెప్పిన ఈ పద్యం అతని సత్యనిష్ఠకు నిదర్శనం. అదేవిధంగా

"మాలమాదిగవారల మందమతుల
కష్టపెట్టిన మనకేమి గలుగు సుఖము?
సర్వజనులను పాలించు జగదధీశు
డరయుచుండడె సకలాంతరాత్మ యగుచు" (న.అ.ప్ర. పద్యం 84)

అనే పద్యం రామిరెడ్డిగారి అభ్యుదయ దృష్టికి అద్దం పడుతుంది.

ఇలా 'నలజారమ్మ అగ్నిప్రవేశము' కావ్యం రామిరెడ్డిగారి భవిష్యత్తు కావ్యాలకు చుక్కాని వంటిదని, తరవాత కాలంలో అనేకమంది పద్య కవులకు మార్గనిర్దేశం చేసిందని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ముగింపు :

1. దువ్వూరి రామిరెడ్డి 'నలజారమ్మ అగ్నిప్రవేశము' కావ్యంలో గ్రామీణ జీవనాన్ని సహజంగా చిత్రీకరించారు. ఇందులో ఇతివృత్తం జనవ్యవహారంలో ఉన్నదే.
2. ఈ కావ్యం నందలి ఇతివృత్తాన్ని పరిశీలిస్తే ఇది ప్రధానంగా సతిసహగమనానికి దగ్గరగా ఉన్నట్లు తెలుస్తుంది. ఇది మధ్యయుగంలో ఆంధ్రదేశంలోని సాంఘిక పరిస్థితులకు అద్దంపట్టేలా ఉంది.
3. 'నలజారమ్మ అగ్నిప్రవేశము' కావ్యం గూడూరు గ్రామ వర్ణనతో ప్రారంభమౌతుంది. అక్కడి వర్ణనలు ప్రబోధాత్మకంగా ఉంది, గ్రామీణుల వాస్తవస్థితిని వెల్లడిస్తాయి.
4. ఈ క్యావ్యం హృద్యమైన వర్ణనలతో నిండి ఉంది. అక్కడక్కడ సందర్భోచితంగా తత్త్వశాస్త్ర, సామ్యవాద విషయాలను స్పృశించారు. రచయిత హేతువాద, అభ్యుదయ దృష్టి కూడా కనిపిస్తుంది.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

5. ఈ కావ్యంలో రచయిత వర్ణనల విషయంలో ఎక్కడా నేల విడిచి సాము చేయలేదు. వర్ణనలన్నీ దాదాపు గ్రామీణుల జీవనానికి దగ్గరగా ఉండేటట్లు చూసుకున్నారు.

**పాదసూచికలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర, పుట 405
2. ఇదే, పుట 405, 406
3. కవికోకిల గ్రంథావళి(శతజయంతి సంపుటి – 1), పీఠిక పుట 5
4. ఆనందనిలయము, పుట 10, 11
5. నలజారమ్మ అగ్నిప్రవేశము, పీఠిక పుట 2
6. కవికోకిల గ్రంథావళి(శతజయంతి సంపుటి – 1), పీఠిక పుట 5
7. ఇదే, పీఠిక పుట 9
8. తెలుగు సాహిత్య చరిత్ర, పుట 95
9. ఇదే, పుట 404
10. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పుట 122

**ఉపయుక్త గ్రంథాలు:**


1. కొండమాచార్యులు ముదివర్తి.(2009).ఆనందనిలయము(తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల వారి ఆధ్యాత్మిక సంకీర్తనలకు సీస పద్యా నుసరణము), తిరుమల తిరుపతి దేవస్థానము ప్రచురణము, తిరుపతి.
2. రామిరెడ్డి దువ్వూరి.(1917).నలజారమ్మ అగ్నిప్రవేశము, ఇండియా ప్రింటింగ్ వర్క్స్ ముద్రాక్షరశాల, మదరాసు.
3. రామిరెడ్డి దువ్వూరి.(1996).కవికోకిల గ్రంథావళి(శతజయంతి సంపుటి – 1), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదారాబాద్.
4. ప్రతాపరెడ్డి సురవరం.(2017).ఆంధ్రుల సాంఘిక చరిత్ర, క్లాసిక్ బుక్స్, విజయవాడ.
5. శాస్త్రి ద్వా.నా. (2013)తెలుగు సాహిత్య చరిత్ర, ప్రగతి పబ్లిషర్స్, హైదరబాద్.